సాక్షి
జనగామ
సోమవారం | 27 | నవంబర్ | 2023



ఆకాశాన్నంటిన 'అఖండ జ్యోతి'
కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పాలకుర్తిలో పరమ శివుడు అఖండ జ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. -6లో▸



కంట్రోల్ యూనిట్ల కేటాయింపు
రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను కేటాయించినట్లు కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. -6లో▸

గరిష్టం/కనిష్టం
31.0°/20.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు ఓరుగల్లుకు ముఖ్యనేతలు

సాక్షి, మహబూబాబాద్: మరో మూడు రోజుల్లో ఎన్నికల పోలింగ్ జరగనుండడంతో అన్ని పార్టీలు ప్రచారం హోరెత్తిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సోమవారం ముగ్గురు ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ అభ్యర్థి హుస్సేన్‌నాయక్ మద్దతుగా ప్రధాని మోదీ పర్యటన, మరిపెడలో కాంగ్రెస్ డోర్నకల్ అభ్యర్థి జాటోత్ రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సభ జరగనుంది. ములుగు జిల్లా ఏటూరునాగారంలో బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతికి మద్దతుగా మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు భారీగా జనసమీకరణ చేస్తున్నారు.

బుగులు వెంకన్నను దర్శించుకున్న వరంగల్ జడ్జి

చిల్పూరు: చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామిని ఆదివారం కో–ఆపరేటివ్ ట్రిబ్యునల్ వరంగల్ జిల్లా కోర్టు జడ్జి ఎకొల్లు సత్యేంద్ర దంపతులతో పాటు యోగా బృందం, కోర్టు సిబ్బంది దర్శించుకున్నారు. జడ్జి దంపతులను అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో ఆశీర్వచనాలు అందించారు. సూపరింటిండెంట్ ఇందిర, నాజిర్, కోర్టు మేనేజర్ సోని, యోగా గురువు రాజేందర్, యోగా సాధకులు లకావత్ చిరంజీవినాయక్, వెంకటేశ్వర్లు, కమలాకర్, సుమ, స్రవంతి, శైలజ, రాజ్‌కుమార్, రాజు, సరిత పాల్గొన్నారు.

'కార్యకర్తలను రేవంత్‌రెడ్డి మోసం చేశాడు'

రఘునాథపల్లి: కాంగ్రెస్ పార్టీకి 40 లక్షల సభ్యత్వముంటే వారికి హెల్త్ ఇన్సూరెన్స్ చెల్లించకుండా టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మోసం చేశాడని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 లక్షల సభ్యత్వమున్న బీఆర్ఎస్‌లో అందరికి బీమా ఉందని, ఇదే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు తేడా అన్నారు. జూలై 2, 3, 4 తేదీల్లో కాంగ్రెస్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించి యువతను మోసం చేసిందన్నారు. ఆ పార్టీలో ఆత్మగౌరవం, సమన్వయం లేదని, పాలించే శక్తి కూడా లేదన్నారు. కేసీఆర్ మూడోసారి హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు. అంతకు ముందు పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు వారాల రమేష్, సర్పంచ్ పోకల శివకుమార్, చీమలపాటి రవీందర్, ధర్మపురి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రహస్య స్నేహితులు!

'కోవర్టు'ల కలకలం..
- అన్ని పార్టీల అభ్యర్థుల్లో గుబులు
- ప్రత్యర్థుల వ్యూహాలపై నజర్
- ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై పరస్పర ఫిర్యాదులు..
- పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి
- పార్టీ ఫండ్, డబ్బుల పంపిణీపై అసంతృప్తిలో కార్యకర్తలు



సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సరిగ్గా మరో మూడు రోజులే ఉంది. సమయం దగ్గర పడుతున్నా కొద్దీ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ రంగులు మారుతున్నాయి. ఉదయానికున్న సమీకరణాలు.. సాయంత్రానికి తలకిందులవుతున్నాయి. పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రత్యర్థి వ్యూహాలను పసిగట్టడం, ప్రచారాలు, కార్యక్రమాలపై నిఘా పెట్టడం.. ఉల్లంఘనలుంటే వాటిపై అధికారులకు ఫిర్యాదు చేయడం వంటివి ముమ్మరంగా సాగుతున్నాయి. వీటితోపాటు ప్రత్యర్థి పార్టీలో కొందరిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వారు చేసిన తప్పులను వీరికి తెలియజేసే పనిని వారికి అప్పజెబుతున్నారు. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు పెట్టడానికైనా సిద్ధమవుతున్నారు. ఇప్పుడు ఫలానా పార్టీ అనే తేడా లేకుండా అన్నింటిలోనూ ఇలాంటి పోకడలు కనిపిస్తున్నాయి. సోమవారం నుంచి ఇవి మరింత తీవ్రరూపం దాల్చనున్నాయి.

కోవర్టుల కలకలం..
ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడనే నానుడి ఉన్నదే. కొంతమంది నాయకుడి వెన్నంటే ఉండి.. నమ్మకంగా నటించి ఇక్కడి విషయాలను ప్రత్యర్థులకు చేరవేస్తున్నారు. సంపాదనే పరమావధిగా ఈ పని చేస్తున్నారు. నాయకులు తనవెనుక ఉండే వారిలో ఇలాంటి వారు ఉన్నారని తెలిసినా వారెవరో గుర్తించలేకపోతున్నారు. ప్రత్యర్థుల చెంత నమ్మకంగా పని చేస్తున్నవారిని నాయకులు బుట్టలోకి లాగుతున్నారు. వారి ద్వారా అక్కడ జరిగే విషయాలను తెలుసుకుంటూ ఎదుటివారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నేతల వివరాలు, సభలు, సమావేశాల్లో జరిగే ఉల్లంఘనలు, ఎన్నికల్లో ధన, మద్య ప్రలోభాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి వివరాలు తెలుసుకునేందుకు ఈ కోవర్టులు ఉపయోగపడుతున్నారు. మరికొన్ని చోట్ల ఒక్కడుగు ముందేసిన కోవర్టులు.. ఓ పార్టీకి చెందిన అభ్యర్థి ఇచ్చిన డబ్బులు పంచుతూ మరో పార్టీ అభ్యర్థికి ఓటేయమని చెబుతున్నారన్న చర్చ ఉంది. ఇందుకోసం ప్రత్యర్థులు భారీగానే ముట్టచెబుతున్నారని సమాచారం.

ఏం చేశారు.. ఎవరికి పంచారు?
బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఆయా పార్టీల అధిష్టానం పంపిన పార్టీ ఫండ్‌పై పలు నియోజకవర్గాల్లో రచ్చ జరుగుతోంది. 'ఎవరికి ఇచ్చారు.. ఎక్కడ పంచారు?' అంటూ బహిరంగంగానే నిలదీతల ఘటనలు వెలుగుచూస్తున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థులకు రూ.10 కోట్ల నుంచి 25 కోట్ల వరకు అందినట్లు ఆపార్టీ ముఖ్యనేతలే చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు రెండు విడతల్లో ఐదు రోజుల తేడాతో రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు అందినట్లు ఆ పార్టీవర్గాల్లో జరుగతున్న చర్చ. అలాగే బీజేపీ అధిష్టానం అభ్యర్థులను బట్టి రూ.50 లక్షల నుంచి రూ. 3 కోట్ల వరకు అందించినట్లు ఆ పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. అర్బన్ స్థానాల్లో పోటీ చేస్తున్న కొందరికి అంతకుమించే అందించినట్లు ప్రచారం. అయితే పార్టీ కార్యకర్తలు, ఓటర్ల కోసం పంపిణీ చేయాల్సి ఉండగా.. చాలా చోట్ల వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమను పట్టించుకోవడం లేదంటూ కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

కొన్నిచోట్ల డబ్బుల వ్యవహారంలో అభ్యర్థుల కుటుంబాల్లో ముదిరిన ఆధిపత్యం ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి చేరింది. ఓవైపు అన్ని పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పడరాని పాట్లు పడుతుంటే... మరోవైపు కోవర్టులు, పార్టీఫండ్, డబ్బుల పంపిణీ వివాదాలతో తలలు పట్టుకుంటున్నారు.

కోవర్టులకు భారీ నజరానాలు
రహస్య స్నేహితులు(కోవర్టులు) అందించిన సమాచారాన్ని బట్టి వారికి నజరానాలు అందించేందుకు అన్ని పార్టీల ముఖ్యనేతలు, అభ్యర్థులు సిద్ధమయ్యారు. ప్రతిఫలాన్ని ఆశిస్తున్నారు. ఎన్నికల సంఘం విధించిన వ్యయ పరిమితి, ప్రచార సమయంలో అభ్యర్థి వెంట తప్పనిసరిగా వీడియో బృందం ఉంటోంది. వీటి బారి నుంచి తప్పించుకునేందుకు అభ్యర్థులంతా రహస్య పద్ధతులు అవలంబిస్తున్నారు. ఎన్నికల నిబంధనల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని వివిధ వర్గాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమయాల్లో జరిగిన ఉల్లంఘనలకు సంబంధించిన ఆధారాలతో సహా ప్రత్యర్థులకు చేరవేస్తే అందుకు తగ్గట్లుగా ప్రతిఫలం అందజేస్తున్నారు. కోవర్టుల సమాచారంతోనే ఎన్నికల సంఘాల వరకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, జనగామ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట తదితర నియోజకవర్గాల్లో ఈ తరహా ఫిర్యాదులందాయి. పలుచోట్ల డబ్బులు తరలిస్తున్న వాహనాలు కూడా పోలీసులకు చిక్కాయి.

ప్రారంభమైన జీడికల్ జాతర


జీడికల్‌లో పూజలు చేస్తున్న వేదపండితులు

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరా చల రామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యహావాచనం, లక్ష్మీపూజతో వేదపండితులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, బుచ్చయ్యశర్మ, శ్రీనివాసాశర్మల వేదమంత్రోచ్చారణలతో సీతారాముల బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 27 కార్తీక మాస పుష్కర పుష్కర స్నానాల కోసం జీడిగుండం, పాలగుండాల్లో భక్తులు స్నానాలు చేసేందుకు తగిన సౌకర్యాలను ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేశం, ఆలయ జూనియర్ అసిస్టెంట్ రాములు, మాజీ డైరెక్టర్ శ్రీశైలం, లింగారెడ్డి, సిబ్బంది మల్లేశ్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.


విల్లు ఎక్కుపెట్టిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా, సభకు హాజరైన జనం

బిల్ట్‌ను తెరిపిస్తాం..

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ట్రైబల్ యూనివర్సిటీ పక్కకే..
- మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తిస్తాం
- పార్టీ అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్‌ను గెలిపించాలి
- ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా


మాట్లాడుతున్న కేంద్రహోం మంత్రి అమిత్‌షా, చిత్రంలో అభ్యర్థి ప్రహ్లాద్

ములుగు /ములుగు రూరల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కమలాపురం రేయాన్స్ బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ములుగు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్ గెలుపు కోరుతూ.. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన సకల జనుల విజయోత్సవ సంకల్ప సభకు అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ట్రైబల్ యూనివర్సిటీకి భూమి ఇవ్వదని, పక్కన పెట్టేస్తుందన్నారు. ములుగు ప్రజలపై ప్రేమతో ప్రధానమంత్రి మోదీ సమ్మక్క–సారలమ్మ పేరుతో ట్రైబల్ యూనివర్సిటీకి ఆమోదం తెలిపి రూ.900 కోట్లు కేటాయించారని తెలిపారు. బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపిస్తే ట్రైబల్ యూనివర్సిటీని త్వరితగతిన పూర్తి చేసి భూమి ఇవ్వడంతో పాటు మరో రూ.300 కోట్లు మంజూరు చేస్తామన్నారు. గిరిజన అటవీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకు రావడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలబాలికలు చదువుకోవడానికి పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు అందిస్తే సీఎం కేసీఆర్ వాటిని అమలు చేయడం లేదన్నారు. శాసనసభల్లో దేశవ్యాప్తంగా అత్యధికంగా గిరిజనులు ఉన్నారని, వారితోపాటు పనిచేసే అవకాశాన్ని తెలంగాణలో ప్రహ్లాద్‌కు ఇవ్వాలని ప్రజలను కోరారు. గిరిజన విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా 7,480 ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించామని తెలిపారు. అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17న అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ అమిత్ షా సభకు హాజరైన ప్రజలను ఉత్తేజపర్చారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్, తన సోదరి పద్మ లంబాడా సంప్రదాయ గుంగ్‌టోతో ఆయనను సన్మానించారు. అనంతరం రామబాణం అందించగా అమిత్ షా ప్రజల వైపు ఎక్కుపెట్టి చూపించారు.

అమిత్ షా పర్యటన సాగిందిలా..
- 2.25గంటలకు సభాస్థలికి చేరుకుని అభివాదం చేశారు.
- 2.34గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు.
- 2.56 గంటలకు ప్రసంగం ముగిసింది.
- అనంతరం గ్యాలరీలో ప్రజలకు అభివాదం చేశారు.
- 3.00గంటలకు బయల్దేరి వెళ్లారు.

బీజేపీని గ్రామాల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్



బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను సభకు వచ్చిన ప్రజలు గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలని అమిత్ షా చేసిన ప్రసంగం ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్ అన్నారు. నియోజకవర్గంలో తన తండ్రి దివంగత అజ్మీరా చందూలాల్ చేపట్టిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందన్నారు. ఎక్కడైతే అభివృద్ధి పనులు ఆగిపోయాయో వాటిని పూర్తి చేసి చూపిస్తానని, తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, స్వరూపారాణి, సురేశ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి


తొర్రూరు : ప్రైవేట్ టీచర్ల సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు


పెద్దవంగర : బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలతో మంత్రి ఎర్రబెల్లి

- ఆరు గ్యారంటీల కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదు
- పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి : నియోజకవర్గ పరిధి అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు ప్రజలను కోరారు. ఆదివారం ఆయన మండల పరిధి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి శ్మశాన వాటిక, నర్సరీ, మొక్కల పెంపకం, సాగు, తాగు నీరు, విద్య, రోడ్ల అభివృద్ధి, వ్యవసాయానికి, మహిళలకు నిధులు, నిరుద్యోగులకు శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. నలభై ఏళ్ల తన రాజకీయ జీవితంలో నిత్యం ప్రజల కోసమే పనిచేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా పాలకుర్తితో పాటు అయ్యంగారిపల్లి, కోతులబాధ, తిర్మలగిరి, ఎల్లరాయనితొర్రూరు గ్రామాల్లో యువతతో కలిసి మంత్రి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగిరెడ్డి, సర్పంచ్‌లు నాయని మల్లారెడ్డి, నాయకుడు చిదిరాల ధనుంజయ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి
మండల పరిధి అన్ని గ్రామాలకు చెందిన దివ్యాంగులతో ఆదివారం దయాకర్‌రావు స్థానిక ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దివ్యాంగుల పింఛన్, ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.


పాలకుర్తి : దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

ప్రైవేట్ టీచర్ల సంరక్షణకు చట్టం తెస్తాం
తొర్రూరు: ప్రైవేటు ఉపాధ్యాయులకు సంరక్షణకు చట్టం తీసుకువస్తాం.. ఇందుకు సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రైవేటు టీచర్ల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లికి మద్దతు తెలిపారు. దయాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యా సంస్థలు, ఉపాధ్యాయుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, కరోనా కాలంలో వారి కష్టాలు స్వయంగా చూశానని చెప్పారు. ఉపాధ్యాయుల సంరక్షణ చట్టం కోసం కేసీఆర్‌తో మాట్లాడుతానని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉందని, ఆరు గ్యారంటీల పేరుతో ముందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదన్నారు. ప్రజలను మోసగించేందుకు సిద్ధమైన ఆ పార్టీకి పొరపాటున ఓటు వేస్తే మూడు గంటల కరెంట్, ఏడాదికో సీఎం మారడం గ్యారంటీ అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గానికి డాలర్లతో గెస్ట్‌లు వస్తున్నారని, వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, ఆయా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, మధుకర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, రమేష్, వేణుమాధవ్, ప్రైవేటు టీచర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక
పెద్దవంగర: మండల పరిధి రాజ్‌మాన్ సింగ్ తండాకు చెందిన భూక్యా వెంకన్న, దేవేందర్, యాకుబ్, డాల్సింగ్, గంగ్యా, హము, దేవిలాల్, కృష్ణా, వెంకన్నతో పాటు హము, దేవేందర్, శంకర్, గణేష్, ప్రవీణ్, హేమాని, రేక్యా, పలువురు దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను నాలుగోసారి గెలిపించి రాష్ట్రంలోనే పాలకుర్తిని నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు పటేల్ నాయక్, బొమ్మకల్లు ఎంపీటీసీ రవీందర్ నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

నా జీవితం తెల్లని కాగితం
- అక్రమం లేదు.. కష్టపడి సంపాదించుకున్నా
- ఉమ్మడి జిల్లాలో తొలి ఉద్యమకారుడిని..
- గెలిపిస్తే వేతనం పేద విద్యార్థుల చదువులకు వెచ్చిస్తా..
- ముత్తిరెడ్డిపై 'పల్లా' చేసిన ఆరోపణలు నిరూపించాలి
- 'సాక్షి' తో కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: 'నీతి, నిజాయితీ, విలువలతో కూడిన జీవితాన్ని అలవాటు చేసున్నా.. ఒక్క రూపాయి కూడా అక్రమం లేదు.. కష్టపడి సంపాదించుకున్నా.. నా ఇన్నేళ్ల రాజకీయ జీవితం ఓ తెల్లని కాగితం'.. అని కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గెలిపిస్తే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు, ఆరు గ్యారంటీ పథకాలు అందిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

ఉమ్మడి వరంగల్‌లో తెలంగాణ తొలి ఉద్యమకారుడిని. స్వరాష్ట్రం కోసం సాగిన పోరులో అన్ని వర్గాల ప్రజలకు వెన్నంటి ఉంటూ తన వంతు సహకారం అందించాను. జనగామ జిల్లా కోసం కొట్లాడిన జనంతో కలిసి నడిచాను. రెండు ఉద్యమాల సమయాల్లో తనపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నాను. 2004 సంవత్సరం జరిగిన ఎన్నికల్లో చేర్యాల ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ చలవతో రూ.వెయ్యి కోట్లు వెచ్చించి తపాస్‌పల్లితోపాటు అనేక రిజర్వాయర్లు నిర్మాణం చేపట్టిన. ఈ రోజు వ్యవసాయం పండుగలా ఉందంటే కేవలం నాటి కృషి ఫలితమే. అయితే ఇటీవల చేర్యాల సభలో సీఎం కేసీఆర్ కాళేశ్వరం నుంచి సాగునీరు ఇస్తున్నట్లు చెప్పడం సిగ్గుచేటు. తపాస్‌పల్లికి దేవాదుల ద్వారా వచ్చే నీరే పారిస్తున్నారు.

వేతనం పేద విద్యార్థులకు..
ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ప్రతి నెలా వచ్చే వేతనం పేద విద్యార్థులు, ఇతర సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తాను. నాడు నియోజకవర్గాల పునర్విభజనలో చేర్యాల కనుమరుగు కావడానికి కేసీఆర్, వినోద్‌కుమార్, పొన్నాల లక్ష్మయ్య పన్నిన కుట్రలే కారణం. ఇక్కడ కొమ్మూరిని అడ్డు తొలగించుకోవడం కోసం ఈ ప్రాంతానికి అన్యాయం చేశారు.

ఎనిమిదేళ్లలో 'పల్లా' చేసిందేంటి?
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎనిమిదేళ్లుగా ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇప్పించలేదు. జనగామ, చేర్యాల మున్సిపల్, గ్రామాలు, మండలాల్లో కనీసం తారురోడ్లు వేయించలేదు. ఈ ప్రాంతానికి తన నిధుల నుంచి అభివృద్ధి ఎందుకు చేయలేదో చెప్పాలి. జనగామ బతుకమ్మకుంట, చేర్యాల పెద్దచెరువుతో పాటు అనేక ప్రాంతాల్లో జరిగిన కబ్జాలపై ప్రజలు ఆందోళన చేస్తే ఎందుకు పట్టించుకోలేదు. ఎమ్మెల్సీ పదవి ఇంకా నాలుగేళ్లు ఉన్నా.. ఎమ్మెల్యేగా ఎందుకు పోటీ చేస్తున్నాడో ప్రజలకు చెప్పాలి. పల్లాపై అనేక భూకబ్జా ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జనగామ చౌరస్తాలో రాజేశ్వర్‌రెడ్డిపై చేసిన ఆరోపణలతో ఏకీభవిస్తున్నాను. దానిని ప్రజలు నమ్ముతున్నారు. అబద్ధమని నిరూపించుకోవాలి. హనుమకొండ జిల్లాకు చెందిన పల్లా.. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లో ఉంటూ స్థానికుడిగా ప్రచారం చేసుకుంటున్నారు. స్థానికత విషయంలో నాకు మాత్రమే హక్కుంది. చేర్యాల, జనగామలో సొంత ఇళ్లు ఉన్నాయి. ఎమ్మెల్యేగా సొంత ఖర్చుతో 14 ఎకరాల స్థలం ఇచ్చి ప్రభుత్వ విద్యాసంస్థలను నెలకొలిపాను. ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదం తన వైపే ఉంటుంది.

చేర్యాల గోసకు కారణం ఎవరు..?
రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం చేర్యాల ప్రజలు ఇన్ని రోజులుగా పోరాటం చేస్తుంటే.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకు పట్టించుకోలేదు. తన కుమారులు భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణలు చేశారు. దీనిపై చర్చకు సిద్ధంగా ఉన్నాను. దమ్ముంటే ఆరోపణలు చేసిన వారు చర్చకు రావాలి. గత సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోతే ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. నేటికీ పైసా ఇవ్వలేదు. రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకు చొరవ చూపలేదు. రాష్ట్రంలో బెల్ట్ దుకాణాలను బార్లా తెరిచి తాగుబోతుల తెలంగాణగా మార్చారు. హైదరాబాద్‌లోని పల్లా ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు. జనగామ పట్టణంలో శుద్ధిచేసిన తాగునీటిని అందించలేక పోయారు. డ్రెయినేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎమ్మెల్యేగా గెలవగానే జనగామ, చేర్యాల పట్టణాలను అభివృద్ధి చేయడంతోపాటు కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తాను.

కంటికి రెప్పలా కాపాడుకుంటా

● బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు


రాయపర్తి: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

రాయపర్తి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, పార్టీ గెలుపునకు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన గంగారం మహేందర్, గాదె యాకయ్య, మేడి రాము, కొండేటి మధు, కొండేటి నాగరాజు, కొండేటి రాజు, గాదె ధన్‌రాజ్, కొండేటి శ్రీకాంత్, మహబూబ్‌నగర్, మైలారం గ్రామాలకు చెందిన ఆర్ఎంపీ శ్రీనివాస్ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎర్రబెల్లి కోడలు మాలతి ప్రచారం

రాయపర్తి మండలంలోని ఏకేతండా, బాలునాయక్ తండా, సుభాష్‌తండా గ్రామాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోడలు ఎర్రబెల్లి మాలతి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్ల అభ్యర్థించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మూడు రంగమ్మ, అమ్మిమాంజ్య, గబ్బెట బాబు, గోవింద్‌నాయక్, గారె కిరణ్, హలావత్ రమేష్, మూడు రవీందర్, వసుంధర్, సోమ నాయక్, నిమ్మల మధు పాల్గొన్నారు.

దయాకర్‌రావుతోనే అభివృద్ధి: ఎర్రబెల్లి ఉషా

దేవరుప్పుల : తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన దయాకర్‌రావును గెలిపిస్తేనే నిరంతరం అభివృద్ధి సాధ్యమని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నమడూరు, అప్పిరెడ్డిపల్లె క్రైస్తవ మతబోధకులచే దయాకర్‌రావు గెలుపు కోసం ఆశీర్వచనాలు పొందారు. అనంతరం కోలుకొండలో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, సర్పంచ్‌లు వంగ పద్మ, సుధాకర్, కూర్నాల రవి, రైతు బంధు కోఆర్డినేటర్ కోతి పద్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాము మోహన్, ఖాసీమ్,ఇంద్రస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే దళిత కాలనీల అభివృద్ధి

బీఆర్ఎస్‌తోనే దళిత కాలనీలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ ఎస్సీ సెల్ దేవరుప్పుల మండల అధ్యక్షుడు మాచర్ల బాబు అన్నారు. ఆదివారం చిన్నమడూరు గ్రామంలోని దళిత కాలనీల్లో దయాకర్‌రావు గెలుపు కోసం విస్తృత ప్రచారం చేపట్టారు.

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయడమే లక్ష్యం

పెద్దవంగర : కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని తెలంగాణ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మంత్రి దయాకర్‌రావు గెలుపునకు ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో దయాకర్‌రావును గెలిపించాలని ఆయన కోరారు.

మంత్రి దయాకర్‌రావును గెలిపించాలి

తొర్రూరు : రాజకీయాల్లో ఎలాంటి మచ్చ లేని దయాకర్‌రావును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేల్పుగొండ వెంకటేష్ అన్నారు. పాలకుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మద్దతుగా ఆదివారం డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల వెన్నంటి ఉండే నాయకుడు దయాకర్‌రావు అని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల కోసమే ఇక్కడ వాలిన టూరిస్టు కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తుగా ఓడించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్, ఓయూ జేఏసీ అధ్యక్షుడు హరినాథ్, ప్రతినిధులు వేల్పుగొండ రామకృష్ణ, అందె రవి పాల్గొన్నారు.


దేవరుప్పుల : కోలుకొండలో ప్రచారం చేస్తున్న ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు


ఏకేతండాలో ప్రచారం నిర్వహిస్తున్న దయాకర్‌రావు కోడలు ఎర్రబెల్లి మాలతి

మార్పు రాకుంటే నిజాం పాలనే..


దేవరుప్పుల: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి


రాయపర్తి: ఝాన్సీరాజేందర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

● కాంగ్రెస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్విని రెడ్డి
● నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతాం..
● అభాగ్యులకు ఆరు గ్యారంటీల అభయహస్తం


మాదాపురం ప్రచార ర్యాలీలో పాల్గొన్న ప్రజలు


కొడకండ్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

దేవరుప్పుల : చైతన్యవంతులైన పాలకుర్తి ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు తెచ్చుకోకుంటే నిజాం పాలన పునరావృతం అవుతుందని కాంగ్రెస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దతండా, మాదాపురం, తూర్పుతండా, దేవునిగుట్ట తండా, పొట్టిగుట్ట తండా, దుబ్బ తండాల్లో 'గడప గడపకు కాంగ్రెస్' ప్రచారంలో ఆమెతోపాటు టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా సేవా దృక్పథం ఉన్న తమ కుటుంబానికి రాజకీయం తోడైతే ఆదర్శవంతమైన ప్రజా సంక్షేమం, అభివృద్ధి చూపిస్తామన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక కార్యాచరణతో నిరుద్యోగుల్లో వెలుగులు నింపుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసారపు ధర్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసాచారి, ఇప్ప పృథ్వీరెడ్డి, అనుబంధ కమిటీల అధ్యక్షులు యాకస్వామి, సజ్జన్, ఇనుముల నాగరాజు, కొడగాని రామచందర్, రాజేందర్‌రెడ్డి, సుధాకర్, నర్సింహ్మా, శ్రీధర్, పాండు కృష్ణ, రమేశ్, శ్రీనివాస్, పులిగిల్ల వెంకన్న పాల్గొన్నారు.

మైనార్టీలకు కాంగ్రెస్ పెద్దపీట

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మైనార్టీలకు పెద్దపీట వేస్తారని పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపునకు ఇంటింటా ప్రచారం చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి : మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన ఓరుగంటి భాస్కర్‌తో పాటు మరో 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరాజేందర్ రెడ్డి వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం

కొడకండ్ల : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్‌అబ్దుల్లా, మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. ఆదివారం పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నిలబెట్టుకొని అమలు చేయడం కాంగ్రెస్ సొంతమని, పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో పేదల సంక్షేమం కరువైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మసురం రవీందర్, నాయకులు మనోహర్, సోమేశ్వర్, ఆగాచారి, ఉపేందర్, సైదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడుదాం: హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి

రాయపర్తి : బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడుదామని చేతి గుర్తుకు ఓటు వేసి యశస్వినిరెడ్డిని పాలకుర్తి నుంచి అసెంబ్లీకి పంపుదామని పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని జగన్నాథపల్లి, ఊకల్, బాలాజీతండా, పానీష్‌తండా, గట్టికల్, గన్నారం, తిర్మలాయపల్లి, జేతురాంతండా, రాయపర్తి గ్రామాల్లో ఝాన్సిరాజేందర్‌రెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన కోడలు యశస్వినిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, చేతి గుర్తుకు ఓటేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం..

పెద్దవంగర : కాంగ్రెస్ పార్టీ గెలిచిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపునకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

అదనపు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల కేటాయింపు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ: రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా అదనపు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను కేటాయించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జనగామ–30, స్టేషన్ ఘనపూర్–25, పాలకుర్తి–30, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లతో పాటు గోడౌన్ నుంచి–10 బ్యాలెట్, 85 కంట్రోల్ యూనిట్లను అదనంగా కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారిని సుహాసిని, ఎస్ఐసీ జాయింట్ డైరెక్టర్ రాంప్రసాద్, కలెక్టరేట్ ఏఓ రవీందర్, ఈడీఎం దుర్గారావు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి కట్టుబడి ఉంటాం

భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుహాసిని, సీపీఓ ఇస్మాయిల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రవీందర్, మన్సూర్ అలీ, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్లు శంకర్, నరేష్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

జనగామ పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను జనగామ ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ పి.రమణ సరస్వతి ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, ప్రిస్టన్ కాలేజీ, రైల్వేస్టేషన్ సమీపంలోని జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు పెంబర్తి వీబీఐటీ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. దివ్యాంగుల కోసం ర్యాంపు నిర్మించాలని, తాగునీరు, విద్యుత్ తదితరుల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సిబ్బందికి కావాల్సిన వసతులు కల్పించి మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఏబీవీ డిగ్రీ కళాశాలలో మైక్రో అబ్జర్వర్లకు, ఓపీఓ అధికారులకు జరుగుతున్న శిక్షణ తరగతులను, ఫెసిలిటేషన్ సెంటర్, మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలపై తగిన సూచనలు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏమైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే 8121278146 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన 'అఖండ జ్యోతి'

● కనుల పండువగా జ్యోతి ప్రజ్వలన


ఆకాశాన్నంటిన అఖండ జ్యోతి


లక్ష దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఉత్తరకాశి పీఠాధిపతి

పాలకుర్తి టౌన్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని క్షీరాద్రి క్షేత్రమైన జనగామ జిల్లా పాలకుర్తిలో పరమ శివుడు అఖండజ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆదివారం సాయంత్రం 6.15 గంటలకు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో క్షీరగిరిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రమిదలో అఖండజ్యోతిని ఉత్తరకాశి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి వెలిగించారు. అంతకు ముందు అఖండ దీపోత్సవంలో భాగంగా ఆలయంలో కలశ స్థాపన, గణపతి పూజ, మండపారాధన నిర్వహించారు. అఖండజ్యోతిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, అర్చకులు పాల్గొన్నారు.

2కే రన్‌కు విశేష స్పందన



2కే రన్‌లో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

జనగామ రూరల్: మూమెంట్ 21 జనగామ డిస్ట్రిక్ట్ రెస్పాన్సిబుల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన 2కే రన్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి నెహ్రూపార్క్ మీదుగా బస్టాండ్ వరకు నిర్వహించారు. అభిషేక్ జ్యోషి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ ప్రీతి దయాల్ పాల్గొని మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. రాజ్యాంగలో కల్పించిన ప్రాథమిక హక్కులతోనే ఈ స్థాయిలో అందరు ఉన్నారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికను కవి పెట్లోజు సోమేశ్వరాచారి చదివి వినిపించాడు. టీం సభ్యులు సాయి కిరణ్, మహేష్, జి.కృష్ణ, సోమ నర్సింహచారి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం

జనగామ: జిల్లా కేంద్రం సూర్యాపేటరోడ్డులోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో నేడు (సోమవారం) మధ్యాహ్నం 12.30 గంటలకు ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతినిధులు జైన రమేష్, బిజ్జాల నవీన్ గుప్తా తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ వైశ్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. ఆర్య వైశ్యుల అభ్యున్నతిపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమ్మేళన కార్యక్రమానికి ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలి వచ్చి, ఐక్యతను చాటి చెప్పాలన్నారు.

రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు

జనగామ : ప్రజలకు ఉపయోగపడని ప్రగతిభవన్‌ను బాంబులు పెట్టి పేల్చేస్తే తప్పేముందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జనగామ సీఐ ఎలబోయిన శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 15న జనగామలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో కేసీఆర్‌పై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ జనగామలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణకు, అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచార సభలో రేవంత్‌రెడ్డి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీర్‌లను ఉద్దేశించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రగతిభవన్‌కు తెలంగాణ ప్రజలను అనుమతి లేదని, ప్రజాగాయకుడు గద్దర్‌ను ప్రగతిభవన్ గేటు ముందు మూడు గంటలు కూర్చోబెట్టారని, అలాంటి ప్రగతిభవన్ అవసరమా, బాంబులు పెట్టి కూల్చేసినా తప్పులేదని ఉద్దేశ్యపూర్వకంగా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్‌ఓ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అనాథ గర్భిణీని చేరదీసిన సఖి నిర్వాహకులు

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి గ్రామంలో ఉంటున్న అనాథ గర్భిణీని సఖి నిర్వాహకులు చేరదీశారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి ఆదేశాల ప్రకారం వసతి కోసం సఖి సెంటర్‌కు తీసుకొచ్చారు. కలకత్తా నుంచి ఓ వ్యక్తి నమ్మబలికి పెంబర్తికి తీసుకొచ్చి వదిలేశాడు. పలుమార్లు సంప్రదించినా వస్తున్నా.. అంటూ దాటవేశాడు. ఇంటి ఓనర్ వారు గర్భిణీ అని చేరదీసి చూసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం ఆమె సఖిని సంప్రదించడంతో మహిళను సఖీ కేంద్రంలో ఉండటానికి ఏర్పాటు చేశారు. అలాగే శనివారం రాత్రి ఆమెకు పురిటినొప్పులు రావడంతో స్థానిక ప్రసూతి ఆస్పత్రికి తీసుకురాగా బాలుడికి జన్మనిచ్చింది. ఇద్దరిని సఖీ సెంటర్ చూసుకుంటుందని నిర్వాహకురాలు రేణుక తెలిపారు.

బీఆర్ఎస్ ప్రచార వాహనంపైనుంచి పడి బాలిక మృతి


అంజలి (ఫైల్)

కొడకండ్ల: బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సంబంధించిన ప్రచార వాహనం పైనుంచి పడి ఓ బాలిక మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని నీలిబండతండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం తండాలో శనివారం సాయంత్రం వాహనం ప్రచారం నిర్వహించే క్రమంలో తండాకు చెందిన గుగులోత్ దేవేందర్, లక్ష్మి దంపతుల కూతురు అంజలి(9)తో పాటు మరికొందరు పిల్లలు వాహనం ఎక్కారు. వాహనం వెళ్తున్న క్రమంలో అంజలి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, కుటుంబీకులు గమనించి అంజలిని వెంటనే చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించగా ఆదివారం మృతి చెందింది. దీంతో తండాలో విషాదం నెలకొంది. కాగా, అంజలి స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● చంపి రైలు ప్రమాదంలా సృష్టిస్తున్నారని బంధువుల ఆందోళన


సిద్దు(ఫైల్)


రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబీకులు

మహబూబాబాద్ రూరల్ : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని పాత కురవి గేటు ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కాగా సదరు యువకుడిని కొట్టి హత్య చేసి రైలు ప్రమాదంలో మృతిచెందినట్లు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు రాస్తారోకో చేపట్టి ఆందోళనకు దిగారు. జీఆర్పీ డోర్నకల్ ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం చంద్యా తండాకు చెందిన భూక్యా నగేష్, శారద దంపతుల కుమారుడు భూక్యా సిద్దు(19) శనివారం అర్ధరాత్రి మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని పాత కురవి గేటు ప్రాంతంలో రైలు ఢీకొని మృతిచెందాడని తెలిపారు. సమాచారం అందిన వెంటనే తాము సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించి భద్రపరిచామన్నారు. ఆదివారం ఉదయం సిద్దు తండ్రి నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం సిద్దు మృతిపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేసి దోషులను గుర్తించి శిక్షించాలని కోరారన్నారు. కుమారుడి మృతికి విష్ణువర్ధన్, శివపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. విచారణ అనంతరం కేసును మహబూబాబాద్ టౌన్ పోలీసులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

బంధువుల రాస్తారోకో

భూక్యా సిద్దు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం చేసేందుకు తీసుకురాగా అతడి బంధువులు, కుటుంబ సభ్యులు సిద్దు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేపట్టి ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఊరుకోబోమని హెచ్చరిస్తూ సిద్దు మృతదేహాన్ని పోస్టుమార్టం గది నుంచి బయటకు తీసుకువచ్చి రోడ్డుపై పెట్టి నినాదాలు చేశారు. మృతుడి తండ్రి నగేశ్ మాట్లాడుతూ.. తమ కొడుకు సిద్దు హైదరాబాద్‌లో ఆటో నడుపుతున్నట్లు తెలిపారు. తండాలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యాక, తండాకే చెందిన కొందరు యువకులు అతనిని సినిమాకు వెళ్దామని మహబూబాబాద్‌కు తీసుకువచ్చారన్నారు. పథకం ప్రకారం హతమార్చి రైలు ఢీకొని మృతిచెందినట్లు వారే తమకు ఫోన్ చేసి వివరాలు చెప్పినట్లు పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ సీఐ సతీష్, ఎస్సై విజయరాం కుమార్ మృతుడి బంధువులతో మాట్లాడి పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.